క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఏసియన్ శ్రీదేవి మాల్, ఏకశిల ఆస్పత్రి, కుడా కార్యాలయం, కంచరకుంట, సెంట్రల్ బాప్టిస్టు చర్చి, బాలసముద్రం స్విమ్మింగ్ పూల్, సాయినగర్, పబ్లిక్ గార్డెన్, జిల్లా గ్రంథాలయం, ఎల్ఐసీ కార్యాలయం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు కలగొద్దు



వరంగల్ క్రైం: ట్రైసిటీ పరిధిలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని ట్రాఫిక్ అధికారులకు ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్‌రావు సూచించారు. సీపీఓ జంక్షన్, యూనివర్సిటీ జంక్షన్లను మంగళవారం సందర్శించారు. ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణ జరగకుండా చూడాలని, అవసరమైన చోట నో పార్కింగ్ బోర్డులు పెట్టాలని ఆయన సూచించారు. అడిషనల్ డీసీపీ వెంట హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

గురుకులంలో యోగా శిక్షణ



మడికొండ: మడికొండ శివారులోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలలో యోగా శిక్షణ తరగతులను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి మాట్లాడుతూ జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ జయప్రకాష్, ఫార్మసిస్ట్ శ్యాంకుమార్, వైద్య సిబ్బంది ఉచిత వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. యోగా వలన కలిగే ఉపయోగాలను యోగా శిక్షకురాలు శ్వేత వివరించారు. యోగాతో ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు.

కేంద్రంపై విమర్శలు సరికావు

ఖిలా వరంగల్: రాష్ట్రాభివృద్ధికి మోదీ సర్కార్ కట్టుబడి ఉందని, కేంద్రం నుంచి వరంగల్ జిల్లాకు నిధులు వచ్చినా రాజకీయ లబ్ధి కోసం మంత్రి సురేఖ అసత్య ప్రచార విమర్శలు చేయడం మానుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సూచించారు. కేంద్రంపై రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. గోదావరి పుష్కరాల కోసం ఆంధ్రాకు నిధులిచ్చిన కేంద్రం.. తెలంగాణకు మాత్రం నిధులివ్వక పక్షపాతం చూపిందని చేసిన ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు. ఎస్ఏఎస్‌సీఐ (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) స్కీం కింద రాష్ట్రాలకు వడ్డీలేని రుణాలను అందిస్తోందని కేంద్రం స్పష్టం చేశారు.

బాలల ఆశ్రమానికి నిత్యావసరాల అందజేత

మామునూరు: ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం రోడ్డు లక్ష్మీపురంలోని న్యూలైఫ్ సొసైటీ బాలల ఆశ్రమాన్ని బెటాలియన్ టీజీటీఎస్పీ నాలుగో బెటాలియన్ కానిస్టేబుళ్లు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులకు నిత్యావసర వస్తువులు, పండ్లు, ఎగ్జామ్స్ పాడ్లు, పెన్నులు, నోటు బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ ఆర్ఐ సాల్మన్‌రాజ్, ఆర్ఎస్సైలు, అధికారులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం



హన్మకొండ: ఎంవీ.కేశవ రెడ్డి స్మారక కళాజ్యోతి పురస్కారాన్ని హనుమకొండ మండలం పలివేల్పుల పాఠశాల ఉపాధ్యాయుడు వెనిశెట్టి రవికుమార్ అందుకున్నారు. వివిధ రంగాల్లోని కళాకారులను ప్రోత్సహించడంతో పాటు, మొక్కలు నాటడం, రక్తదానం చేయడం, మట్టి వినాయకుల పంపిణీ, విద్యా, సామాజిక, వికలాంగుల కోసం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వెనిశెట్టి రవికుమార్‌ను కళాజ్యోతి అవార్డుకు ఆంధ్రప్రదేశ్ చిత్తూరుకు చెందిన ఎంవీ.కేశవ రెడ్డి స్మారక ఫౌండేషన్ ఎంపిక చేసింది. చిత్తూరులోని నాగయ్య కళా మందిరంలో సోమవారం రాత్రి జరిగిన తెలుగు తేజాలకు కళాభిషేకం కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ మనువడు, ప్రధానమంత్రి జాతీయ విద్యా సలహాదారుడు సుబ్రహ్మణ్యం, సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్, కవి, గాయకుడు సుద్దాల అశోక్‌తేజ, పద్మావతి విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి కృష్ణవేణి చేతుల మీదుగా కళాజ్యోతి అవార్డును రవికుమార్ అందుకున్నారు.

ఆధార్ సేవలు నిలిపివేత

- హసన్‌పర్తిలో నెల రోజులుగా మూసిఉన్న నమోదు కేంద్రం
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలో ఆధార్ సేవలు నిలిచిపోయాయి. దీంతో ఈ ప్రాంతానికి చెందిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూఐడీఏ సంస్థ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలోని ఓ గదిలో ఆధార్ సేవలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన ప్రజలు ఇక్కడికి వచ్చి ఆధార్ సేవలు పొందుతున్నారు. సుమారు నెలరోజుల క్రితం ఇక్కడ ఆకస్మాత్తుగా సేవలు నిలిపివేశారు. ముఖ్యంగా హసన్‌పర్తి మండల కేంద్రంతో పాటు అన్నాసాగరం, మడిపల్లి, సీతంపేట, చింతగట్టు, మునిపల్లి, గంటూరుపల్లి, పెంబర్తి, నాగారం, ముచ్చర్ల, భీమారం, వంగపహాడ్, పెగడపల్లి, జయగిరి, మల్లారెడ్డిపల్లి, సిద్దాపురం, బైరాన్‌పల్లి, అర్వపల్లితో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు మొబైల్ నంబర్ లింక్, బయోమెట్రిక్ అప్‌డేట్, కొత్త ఆధార్ కార్డు, కార్డులో మార్పులు చేర్పులకు ఇక్కడికే వస్తుంటారు. అయితే ఆధార్ నమోదు కేంద్రం మూసి వేయడంతో అధిక వ్యయప్రయాసాల కోర్చి హనుమకొండ, ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ సేవలను స్థానికంగా కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.



మూసివేసిన ఆధార్ నమోదు కేంద్రం

ఇబ్బంది పడుతున్నాం..



ఆధార్ నమోదు సెంటర్ మూసివేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆధార్ కార్డు సేవల కోసం అధిక వ్యయం ఖర్చు చేసి హనుమకొండకు వెళ్లాల్సి వస్తోంది. రోజంతా గడుస్తోంది.

\- నాగరాజు, చింతగట్టు

అధికారులు చర్య తీసుకోవాలి



ఆధార్ సేవలు కొనసాగించడానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలి. బ్యాంకుల్లో కూడా కొంతకాలం సేవలు కొనసాగాయి. అక్కడ కూడా సేవలు నిలిపివేశారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని తిరిగి సేవలు కొనసాగించాలి.

\- విక్టర్ బాబు, భీమారం

ఆ పాఠశాలలను మూసివేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

విద్యారణ్యపురి: అనుమతి లేని హనుమకొండలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థను మూసివేయాలని యూఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నిరసన తెలిపారు. భవిత కేంద్రానికి హనుమకొండ డీఈఓ వాసంతి వస్తున్న క్రమంలో ఆమె కారును అడ్డగించి నిరసన తెలిపారు. ఒక క్యాంపస్ పేరుతో అనేక విద్యాసంస్థలను నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలపై ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని అన్నారు. యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్‌నాయక్, బాధ్యులు రాకేష్, సిద్దు, జయకృష్ణ, మనోజ్, హరీష్, సాయిప్రదీప్, బన్ని పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థను మూసివేయాలి

హనుమకొండలో విచ్చలవిడిగా బ్రాంచీలు తెరిచి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న ఓ ప్రైవేట్ విద్యాసంస్థను మూసివేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ స్కూల్ వద్ద మంగళవారం ఆందోళన చేశారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మంద నరేష్, తిరుపతి, సాయిశ్రీనాథ్, గణేష్, మహేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



రాంపూర్‌లో విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేస్తున్న దాతలు

మడికొండ: రాంపూర్‌లోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు, బ్యాగులు, నోట్ బుక్స్‌ను మంగళవారం అందజేశారు. రిటైర్డ్ డీఎస్పీ కొత్త వీరారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమార్తెలు డాక్టర్ నిలోహిత, చైతన్య నోట్ బుక్స్ అందజేయగా, న్యూసైన్స్ కళాశాల లెక్చరర్ కుమారి భాగ్యలక్ష్మి, గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి రాంగోపాల్ రావు, మానుపాటి సమ్మయ్య స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని అన్నారు. కార్పొరేటర్ సరోజన, మడికొండ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సంధ్యారాణి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ స్రవంతి, హెచ్ఎం రాంచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు లీలారాణి, శంశొద్దీన్, లక్ష్మి, బ్రహ్మచారి, అరుణ, స్వర్ణలత, సీఆర్పీ రేణుక పాల్గొన్నారు.

ఆడెపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

ఖిలా వరంగల్: వరంగల్ చింతల్ ప్రభుత్వ పాఠశాల, స్తంభంపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆడెపు ఫౌండేషన్ చైర్మన్ వెంకటేష్ ఆధ్వర్యంలో నోటుబుక్స్, పెన్నులను మంగళవారం పంపిణీ చేశారు. చిలకమారి సంజీవ్, లక్ష్మీపతి, చిదురాల రాజు, ఆడెపు మధుసూదన్, దుస్స శ్రీధర్, గుండేటి రాజు, సిద్ధరాజు, జోగు రాజేంద్రప్రసాద్, ఆకారపు శేఖర్, రాజ్‌కుమార్, నవీన్, ఎల్లయ్య, జంపయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐలో గుర్తింపు సంఘం ఎన్నికలు

కాజీపేట: భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) కాజీపేట ప్రధాన కార్యాలయంలో మంగళవారం గుర్తింపు సంఘం ఎన్నికలు సజావుగా సాగాయి. బీఎన్‌కే, ఈఎస్‌యూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫుడ్ కార్పొరేషన ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ యూనియన్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేటగిరి త్రీ అండ్ ఫోర్ ఎంప్లాయీస్ యూనియన్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ అసోసియేషన్లు తమ అభ్యర్థులను బరిలో దింపాయి. ఎన్నికల అధికారులుగా శివ వెంకట్, రవిప్రకాష్ వ్యవహరించారు. జిల్లాలోని ఎఫ్‌సీఐల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 126 మంది ఓటర్లకు గాను 123 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. తాళ్ల పవన్‌కుమార్, వరుణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మోహన కృష్ణ ఎన్నికలు సరళిని పరిశీలించారు.



ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న ఉద్యోగులు

నీట్‌లో ‘ఆకాశ్’ విద్యార్థుల ప్రతిభ

హన్మకొండ: నీట్ –2025లో ఆకాశ్ వరంగల్ బ్రాంచ్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారని ఆకాశ్ అసిస్టెంట్ డైరెక్టర్ సుమన్ కుమార్ తెలిపారు. హనుమకొండ అంబేడ్కర్ కూడలిలోని ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ కార్యాలయంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ ఆకాశ్ బ్రాంచ్ నుంచి 133 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. దీపికా ఝున్వార్, ప్రత్యేకాంతం ప్రణవిత, వర్షశ్రీ, తేజస్విని త్రిపురోజు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని వివరించారు. వారితో పాటు టాప్ 10లో ఐదుగురు, టాప్ 15లో 18 మంది, టాప్ 100లో 35 మంది జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారని అన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సుమన్ కుమార్

బీజేపీ ఆధ్వర్యంలో దేశంలో సుపరిపాలన



సభలో మాట్లాడుతున్న వెంకటరమణ

వరంగల్: ప్రధాని నరేంద్రమోడీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం గత 11ఏళ్లుగా దేశంలోని ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, కుసుమ సతీష్ అన్నారు. పార్టీ కాశిబుగ్గ కన్వీనర్ కందూరి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సంకల్ప సభలో వారు మాట్లాడారు. సేవ, సుపరిపాలన, పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ భారత్‌కు ఎదురవుతున్న ప్రతి సవాళ్లను ధైర్యంగా మోదీ ప్రభుత్వం ఎదుర్కొంటోందని అన్నారు. ప్రపంచం అనిశ్చిత పరిస్థితుల్లో ఉన్నప్పటికీ భారత్ అభివృద్ధి చెందుతూ గ్లోబల్ ఆర్థికశక్తిగా ఎదుగుతోందని చెప్పారు. సభలో నాయకులు సముద్రాల పరమేశ్వర్, రతన్, అపురూప సాయిరాం, రఘునారెడ్డి, వెంకటేశ్వర్లు, కోట సతీష్, రాకేష్, రాఘవాచారి, మామిడాల సతీష్, ప్రవీణ్, అజయ్, కోటి, క్రాంతి, భాస్కర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు

ఖిలా వరంగల్: వరంగల్ పుప్పాలగుట్టలోని చింతల్ బ్రిడ్జిపై నిత్యం ఏదో ఒక రోడ్డు ప్రమాదం జరుగుతోంది. ట్రాఫిక్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టింపు కరువైంది. ఇటీవల ప్రమాదాలు సంఖ్య మరింత ఎక్కువైంది. ప్రమాదాల నివారణకు సామాజిక వేత్త ఎల్.శ్రీనివాస్ స్పందించారు. ఎల్లో, రెడ్ రేడియం స్టికర్లతో కూడిన ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.



ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సామూహిక అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేస్తున్న పిల్లలు

మడికొండ: 46వ డివిజన్ మడికొండ సెక్టర్ రాంపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో శారద, జ్యోతి, మంజుల, పద్మావతి, స్వరూప, సంధ్యారాణి, రజిత, పిల్లలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

37వ డివిజన్‌లో..

ఖిలా వరంగల్: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని 37వ డివిజన్ కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ కోరారు. అమ్మ మాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు స్వర్ణలత, శోభ, రాజమణి, రమ, వహీద్, రాణి, కవిత, రజిత, స్వర్ణలత, కవిత, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

- కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: 3 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లలో చేర్పించాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా సంక్షేమ అధికారి జయంతి అధ్యక్షతన 49వ డివిజన్ జులైవాడ అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల్లో శారీరక పెరుగుదలతో పాటు మానసిక, సామాజిక, మేధో సంపత్తి పెంపొందుతుందని చెప్పారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు నిబంధనల మేరకు పనిచేయాలన్నారు. కార్పొరేటర్ మానస – రాంప్రసాద్ కుమార్తెను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. సీడీపీఓ విశ్వజ, సూపర్‌వైజర్లు రాజలక్ష్మి, జ్యోతి, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ ప్రీతి, డీహెచ్‌ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ కల్యాణి, సఖి అడ్మిన్ హైమావతి, అంగన్‌వాడీ టీచర్లు ప్రసన్న, రమాతార, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ హెచ్చరించారు. వరంగల్ నగర పరిధిలోని 25, 26వ డివిజన్లలో పలు కాలనీల్లో క్షేత్రస్థాయిలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్మికులతో మాన్యువల్‌గా సంతకాలతో పాటు బయోమెట్రిక్ హాజరు కూడా ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం నమోదు చేయాలని జవాన్లకు సూచించారు. చార్‌బౌలి వాటర్ ట్యాంక్ ఆవరణలో నిర్వహిస్తున్న డీఆర్‌సీసీ సెంటర్‌తో పాటు నర్సరీనీ పరిశీలించి నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఎల్లమ్మ గుడి చౌరస్తా నుంచి చార్‌బౌలి వాటర్ ట్యాంక్ వరకు నిర్వహించిన ర్యాలీలో కమిషనర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి ఇన్‌చార్జ్ ఎస్ఈ, సీపీలు శ్రీనివాస్, రవీందర్ రాడేకర్, వెటర్నరీ డాక్టర్ గోపాల్ రావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.



హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

బీసీ టీచర్స్ అసోసియేషన్‌ను బలోపేతం చేయాలి



సమావేశానికి హాజరైన జ్యోతి, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బీసీ టీచర్స్ అసోసియేషన్‌ను బలోపేతం చేయాలని గతంలో బీసీ టీచర్స్ అసోసియేషన్ బాధ్యులుగా వ్యవహరించిన ప్రొఫెసర్లు నర్సింహచారి, జ్యోతి, స్వర్ణలత కోరారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన బీసీ టీచర్స్ అసోసియేషన్ సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా పనిచేయాలని సూచించారు. బీసీలకు జాతీయ విద్యాసంస్థల్లో దక్కాల్సిన న్యాయమైన వాటా దక్కడం లేదని వాపోయారు. దేశంలోని 45 సెంట్రల్ యూనివర్సిటీల్లో కేవలం నాలుగు శాతం మంది మాత్రమే ఓబీసీ ప్రొఫెసర్లు ఉన్నారని అన్నారు. బీసీ టీచర్ల తదుపరి కార్యక్రమాల నిర్వహణకు డాక్టర్ నాగయ్య, డాక్టర్ కృష్ణ, డాక్టర్ రమేష్, డాక్టర్ సునీత, డాక్టర్ శ్రీలత, డాక్టర్ కిరణ్‌ను కన్వీనర్లుగా నియమించారు.

సంక్షిప్తంగా

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

ఖిలా వరంగల్: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని, ఉన్నత విద్యావంతులైన అధ్యాపకులతో బోధన జరుగుతోందని, ఈ క్రమంలో విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే చేర్పించాలని డీఐఈఓ శ్రీధర్ సుమన్ సూచించారు. ఇంటర్మీడియేట్ అడ్మిషన్ల ప్రచారం, పాఠ్యపుస్తకాల పంపిణీలో భాగంగా వరంగల్ శంభునిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, నాణ్యమైన విద్యాబోధన వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులపై ఉందని గుర్తుచేశారు. కార్పొరేట్ మాయాజాలంలో పడి విద్యార్థుల తల్లిదండ్రులు లక్షల రూపాయలు కోల్పోతున్నారని అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేణుకాఎల్లమ్మ తల్లి కల్యాణ వేడుకలు

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులోని రేణుకాఎల్లమ్మ తల్లి, కంఠమహేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ముగిశాయి. జమదగ్ని మహాముని, రేణుకఎల్లమ్మ తల్లి కల్యాణ వేడుకలను ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు ఎల్లంభట్ల రవీందర్ శర్మ ఆధ్వర్యంలో అర్చకుడు శంకర్‌శర్మ కనులపండువగా జరిపించారు. మహిళలు బోనాలతో పురవీధుల మీదుగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. గీత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొల్లికొండ యాదగిరి, బుర్ర శ్రీనివాస్, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, గౌడ సంఘం నాయకులు చిర్ర నర్సింగ్ గౌడ్, బొల్లికొండ వెంకటేష్, బుర్ర బాబురావు, బి.ఉపేందర్, బొల్లికొండ హనుమంత్, గౌని సాంబయ్య ప్రత్యేక పూజలు చేశారు.

ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

హన్మకొండ: ఆహార నాణ్యతా ప్రమాణాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఫుడ్ సేఫ్టీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్, మాస్టర్ ట్రైనర్ డాక్టర్ ఆంజనేయులు చాగంటి అన్నారు. హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో రెండు రోజుల పాటు ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ అండ్ సర్టిఫికేషన్ అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. అనంతరం నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ పి.హరీందర్ రెడ్డి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రాజప్రసాద్, లైఫ్ సైన్సెస్ డీన్ జి.విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ స్నేహ శబరీష్‌కు శుభాకాంక్షలు

హన్మకొండ: హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌ను టీజీఎస్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, డీఈ (టెక్నికల్) ఏ.విజేందర్‌రెడ్డి, హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ముస్లిం వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక

న్యూశాయంపేట: గ్రేటర్ వరంగల్ నగరానికి చెందిన ముస్లిం వెల్ఫేర్ సొసైటీ (స్వచ్ఛంద సంస్థ) జనరల్ బాడీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షుడిగా మహ్మద్ సిరాజ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా ఎంఏ.కలీం, కోశాధికారిగా మిర్జా హసన్ చిస్తీ, అసోసియేట్ అధ్యక్షుడిగా రవూఫ్‌ఖాన్ ఆరిఫ్, ఉపాధ్యక్షులుగా ఖైరున్ నాస్రీన్, అబ్దుల్ మజీద్, జాయింట్ సెక్రటరీలుగా సలీంఅహ్మద్, రహీమొద్దీన్ లాయఖ్, కార్యవర్గ సభ్యులుగా జలీల్‌ఖాన్, మహమూద్ అలీ, సఫ్దార్ బాబా, ఫతేవుల్లా బేగ్ రియాజ్, కరం అలీఖాన్, అజీజ్ అహ్మద్, మొహినొద్దీన్ అక్తర్‌ను ఎన్నుకున్నారు. కాగా, నూతన కార్యవర్గం మూడేళ్లపాటు కొనసాగనుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం మడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన ముత్తోజు శంకరయ్య తన ఇంట్లోకి కిరాణ సామాన్లు తీసుకురావడానికి నడుచుకుంటూ వెళ్లి తిరిగి వస్తుండగా మెట్టుగుట్ట ద్వారం సమీపంలో ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దాంతో అతడికి తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు. బాధితుడి కుమారుడు ముత్తోజు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆధ్యాత్మిక భావన పెంపొందించాలి

కాజీపేట: పిల్లలను విందులు, వినోదాలు, సినిమాలకు తీసుకెళ్తున్నట్లుగానే దేవాలయాలకు తీసుకెళ్లి దైవభక్తితో పాటు ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని శ్వేతార్క మూలగణపతి ఆలయ వ్యవస్థాపకుడు అయిన వోలు వెంకటేశ్వర్లు శర్మ కోరారు. కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలో భక్తులతో ఆయన మంగళవారం ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పిల్లలు పాశ్చాత్య మోజులో పడిపోకుండా కాపాడుకుంటూ భక్తిభావం వైపు నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, మణిదీప్, రవి, దేవులపల్లి సదానందం, తుమ్మ శ్రీనివాస్, రాజ్‌మోహన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

మడికొండ: కాజీపేట మండలం మడికొండ 64వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పార్టీ మండల అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాసరెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతీ నిరుపేదకు ఇల్లు కట్టి ఇవ్వడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చిన్నకుమార్, అంకూస్ రాజ్‌కుమార్, దువ్వ విజయ్, గోపనబోయిన దిలీప్, హౌజింగ్ ఏఈ రాజేశ్వరి, వార్డు ఆఫీసర్ మమత, కార్యకర్తలు మురళి, చంటి, రసజ్ఞ పాల్గొన్నారు.

ఏకశిలనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

దేశాయిపేట: ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌జోషి అన్నారు. 13వ డివిజన్‌లోని ఏకశిలనగర్‌లో ఇళ్ల నిర్మాణాలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బొట్ల ప్రసాద్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గిన్నారం రాజు, అక్రమ్ ఖద్దూస్, దార సునీత, వార్డు ఆఫీసర్ కవితరాణి, తదితరులు పాల్గొన్నారు.

2వ డివిజన్ వంగపహాడ్‌లో..

హసన్‌పర్తి: నగరంలోని 2వ డివిజన్ వంగపహాడ్‌లో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోలం అనిల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మార్త రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వరంగల్: 20వ డివిజన్‌లో కార్పొరేషన్ నిధులు రూ.5 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కొరివి పరమేశ్వర్, పెండ్యాల స్వరాజ్, కొమురయ్య, గొర్రె ప్రశాంత్, జన్ను వేణు, గడ్డం లక్ష్మీనారాయణ, దేవనూరి రవి, బూర నటరాజ్, ఆర్పీ కళావతి, సీతారాములు, గొర్రె వంశీ, తోట బాలరాజు పాల్గొన్నారు.

కుమారుడితో కలిసి వివాహిత అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి కరీమాబాద్ అశోక్ వీధికి చెందిన ఓ వివాహిత తన రెండేళ్ల కుమారుడితో కలిసి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. మేకల నాగరాజు వాటర్ ప్లాంట్‌లో గుమస్తాగా పనిచేస్తూ తన భార్య రవళి, ఇద్దరు కుమారులను పోషిస్తున్నాడు. సోమవారం రాత్రి రవళి తన చిన్నకుమారుడిని తీసుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో నాగరాజు మంగళవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ వివరించారు.

యోగా సాధన.. ఆరోగ్యానికి మేలు



రామన్నపేట: ప్రతిరోజు యోగా సాధన చేయడం వల్ల శరీరంలోని చిన్నచిన్న రుగ్మతలు దరిచేరవని ఏవీవీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడాల సుధాకర్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ మట్టెవాడలోని ఏవీవీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా వాకర్స్‌కు మూడు రోజుల ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈమేరకు మంగళవారం జరిగిన ముగింపు సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వాకింగ్, యోగా రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ వాసవి దేవి, శైలజ, ప్రభ, మంజుల, స్వాతి, గీత, కరుణ, పుష్ప, దీప్తి, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.